క్లుప్తంగా

నేడు ఎంపీపీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు

మాడుగుల రూరల్ : స్థానిక మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం ఉదయం 11 గంటలుకు జరుగుతుందని ఎంపీడీవో కె.అప్పారావు బుధవారం తెలిపారు. మండలంలో 21ఎంపీటీసీ సభ్యులకు ఫారం–5 ద్వారా నోటీసులు అందజేసి, గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో జరిగే ఎంపీపీ ఎన్నికకు హాజరు కావాలన్నారు. జిల్లా పంచాయ తీరాజ్ ఇంజినీరింగ్ అధికారి కె.వీరంనాయుడు ఎన్నికలాధికారిగా వ్యవహరిస్తారన్నారు.

నేడు నాలుగు పంచాయతీల ఉప సర్పంచ్‌ల ఎన్నికలు

మాడుగుల రూరల్: మండలంలో నాలుగు గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నికలు గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు బుధవారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి సూచనల మేరకు మండలంలో కె.జె.పురం, కింతలి, మాడుగుల, పోతనపూడి అగ్రహారం గ్రామ పంచాయతీలకు ఉపసర్పంచ్‌లను ఎన్నుకోవాల్సి ఉందన్నారు. దీనికి ఆయా గ్రామాలకు ఎన్నికల అధికారులుగా రావికమతం, బుచ్చెయ్యపేట, కె. కోటపాడు, నర్సీపట్నం మండల పంచాయతీ విస్తరణాధికారులను నియమించారన్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉప సర్పంచ్‌లను ఎన్నుకోవాలన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీడీపీవో శ్రీదేవి, శిక్షకులు చిన్నమ్మలు, ఈశ్వరమ్మ, నారాయణమ్మ

మాడుగుల : అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ, పఢాయి భీ మూడు రోజుల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయని ఐసీడీఎస్ సీడీపీవో సిహెచ్. శ్రీదేవి అన్నారు. మండలంలో ఎం కోడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముగింపు శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల సమర్థ నిర్వహణతో పాటు కేంద్రాల ద్వారా పోషణలో మెలకువలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకులు పోతల చిన్నమ్మలు, ఈశ్వరమ్మ, నారాయణమ్మ, కార్యాలయం సిబ్బంది విశ్వనాథం, కార్తీక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవంతి విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు ప్రధానం చేసిన విద్యార్థులతో డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ చైతన్య

నర్సీపట్నం : మాకవరపాలెం అవంతి ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ క్రాస్ విద్యార్థులు మహాశివరాత్రి మహోత్సవాల్లో పోలీసులతో పాటు సేవలు అందించారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లలో 50 మంది విద్యార్థులు వలంటీర్స్‌గా సేవలందించారు. ఈ సేవలకు గాను బుధవారం నర్సీపట్నం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ చైతన్య అవార్డు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ హరికిరణ్, ఎన్‌ఎస్ఎస్ ఆఫీసర్ గణేష్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

అయ్యన్న పాఠశాలలో ముందస్తు రంజాన్ వేడుక



ఈద్ ముబారక్ అని తెలుపుకుంటున్న విద్యార్థులు

కె.కోటపాడు : కె.కోటపాడు అయ్యన్న పాఠశాలలో బుధవారం ముందస్తు రంజాన్ వేడుకలు జరిపారు. సర్వమతాల పండగలను పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకుంటూ పండగల ఔన్నత్యాలను విద్యార్థులకు వివరించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ అన్నారు. రంజాన్ పండగకు సంబంధించి ఖురాన్‌లో పొందుపర్చిన ప్రాముఖ్యత, విశిష్టతను తెలిపారు. ఇఫ్తార్ విందులో భాగంగా ఖర్జూరాలను, సేమియా పాయసం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈద్ ముబారక్ అని విద్యార్థులు చెబుతూ ఆలింగనంలను చేసుకున్నారు. రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రూ.300 వేతనం అందేలా పనికల్పన

మాకవరపాలెం: ఉపాధి హామీ పథకంలో దినసరి వేతనం రూ.300 రావడమే లక్ష్యంగా పనులు కల్పిస్తామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఏడాదిలో ప్రతి కూలీకి వంద రోజుల పని, పశువులకు తాగు నీటి తొట్టెలు, ప్రతి పంచాయతీలో 25 పంట కుంటలు నిర్మాణం చేస్తామన్నారు. అలాగే చెరువులు, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపుతోపాటు చేపల చెరువుల నిర్మాణం చేయనున్నట్టు చెప్పారు. ప్రతి కూలీకి దినసరి వేతనం రూ.300 వచ్చేలా పనులు కల్పిస్తామన్నారు.







ప్రభుత్వ భూముల్లో దర్జాగా లేఔట్

గెడ్డలు, వాగులు హాంఫట్

కొండలు సైతం పిండి

యథేచ్ఛగా బ్లాస్టింగులు

గరిశింగి రెవెన్యూలో కబ్జాదారుల ఇష్టారాజ్యం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అధికారం అండగా ఆక్రమణలు మెండుగా..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ కబ్జాలు పెచ్చుమీరుతున్నాయి. జిరాయితీలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇష్టారాజ్యంగా లేఔట్లు నిర్మిస్తున్నారు. కొండలు, గెడ్డలు, వాగులు , ప్రభుత్వ భూములను యథేచ్ఛగా చెర బడుతున్నారు. ఆక్రమణల పర్వానికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు అటుగా కన్నెత్తి కూడా చూడడం లేదు. అధికార పార్టీ నేతల అండతోనే దేవరాపల్లి మండలం గరిశింగి రెవెన్యూ పరిధిలో రియల్ వ్యాపారులు చెలరేగిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



లేఔట్‌లో భారీ బండ రాళ్లను బ్లాస్టింగ్ చేయడంతో తుళ్లిపడిన రాళ్లు

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం గరిశింగి రెవెన్యూ పరిధిలో విశాఖపట్టణం ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు 25 ఎకరాల జిరాయితీ భూములను రైతుల నుంచి కనుగోలు చేసి లేఔట్ ఏర్పాటు చేశారు. లేఔట్‌కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకున్నారు. సదరు జిరాయితీకి ఆనుకొని ఉన్న ఎల్‌పీఎం నెంబర్ 49లో 2.18 ఎకరాల కొండ గెడ్డ ఉంది. దీనిలో కొంత మేర ఆక్రమించడంతో పాటు ఈ స్థలంలో బోరు సైతం తవ్వించారు. ఎల్‌పిఎం నెంబర్ 78లో 3.37 ఎకరాల విస్తీర్ణంలో వాగు ఉంది. వాగును సైతం కొంత మేర ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారు. సదరు లేఔట్‌కు పై భాగంలో ఉన్న కొండల నుంచి వచ్చే వర్షపు నీరు సదరు గెడ్డ, వాగుల ద్వారా సమీపం చెరువుల్లోకి చేరుతుంది. గెడ్డపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పైపు కల్వర్టు నిర్మించి దర్జాగా లేఔట్‌లోకి రహదారి ఏర్పాటు చేసుకున్నారు. వెరసి గెడ్డ ఆక్రమణకు గురికావడంతో కనుచూపు మేర ఆనవాలు కనిపించడం లేదు. ఇది ఇలా ఉండగా లేఔట్‌కు ఆనుకొని ఉన్న బంజరు భూములను సైతం ఆక్రమించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఎంతమేర ఆక్రమణలు ఉన్నాయనే వివరాలను రెవెన్యూ అధికారులు నిగ్గు తేల్చాల్సి ఉంది.

లేఔట్‌లో ఇష్టారాజ్యంగా బ్లాస్టింగ్

లేఔట్‌లో ఇష్టారాజ్యంగా పెద్ద పెద్ద బండ రాళ్లను బ్లాస్టింగ్ చేసి పిండి చేశారు. సొంత జిరాయితీ భూమిలో బ్లాస్టింగ్ చేయాల్సి ఉన్నా రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. **అయితే ఇక్కడ లేఔట్ నిర్వాహకులు మాత్రం అవేమి తమకు పట్టవంటూ ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండానే బండ రాళ్లకు రంధ్రాలు చేసి యథేచ్ఛగా బ్లాస్టింగ్ చేస్తుండడంతో** సమీప రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణ చెరలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు..



గరిశింగి లేఔట్ ఆక్రమణ విషయం తమ దృష్టికి రాగా వెంటనే తమ సిబ్బందిని పంపించి సర్వే చేయించి ఫ్లగ్ మార్కింగ్ చేయించాం. ఆక్రమణలు తక్షణమే తొలగించాలని లేఔట్ యజమానికి సూచించాం. లేకుంటే తామే ఆక్రమణలను తొలగించి సదరు స్థలాల్లో హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేస్తాం. లేఔట్‌లో బ్లాస్టింగ్‌కు వారు ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.

– పి.లక్ష్మీదేవి, తహసీల్దార్, దేవరాపల్లి

డీఎస్పీ శ్రావణి ఆకస్మిక తనిఖీ

- కేసుల పురోగతిపై ఆరా
- పూర్తి స్థాయిలో గంజాయి అరికట్టాలని ఆదేశాలు



రోలుగుంట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

రోలుగుంట : మండలంలో గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టి, పరారీలో ఉన్న పాత నేరస్తులను పట్టుకోవాలని అనకాపల్లి డీఎస్పీ శ్రీమతి ఎం ,శ్రావణి కొత్తకోట సీఐ కోటేశ్వరరావుని, స్థానిక ఎస్ఐ రామకృష్ణారావుని ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆమె బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ అవరణను పరిశీలించారు. కేసుల పురోగతిని ఎస్ఐ రామకృష్ణారావుని అడిగి తెలుసుకున్నారు. పరారీలో ఉన్నవారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పట్టుకోవాలన్నా రు. గంజాయి వ్యాపారంలో సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. తమ సమస్యలపై స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

కష్టపడి చదివితే లక్ష్యం సాకారం

నర్సీపట్నం : శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ట్రైనీ డీఎస్పీ చైతన్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. మీరంతా బాగా చదువుకుని మంచి ఉద్యోగాన్ని సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చ అనంతరం టౌన్ సీఐ జి.గోవిందరావు విద్యార్థులకు దిశ నిర్దేశం చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం డీఎస్పీ చైతన్య, సీఐని కళాశాల కరస్పాండెంట్ గాది సత్యవతి, డైరెక్టర్ బోళెం దొరబాబు, ప్రిన్సిపాల్ నానాజీ జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

మిరియాల చెరువు హద్దుల నిర్ధారణ



చెరువు హద్దులు నిర్ధారణ చేస్తున్న రెవిన్యూ అధికారులు

రావికమతం : గొంప చెరువు హద్దులు ఆక్రమణలు, చెరువు నిర్ధాణకు సంబంధించి రెవిన్యూ, సర్వే అధికారులు మరోసారి సర్వే నిర్వహించారు. ఆక్రమణకు గురైన ఈ చెరువు హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేయడం ఇది మూడోసారి. గతేడాది డిసెంబర్ 12న, ఈ ఏడాది జనవరి 9న రెండు దఫాలుగా సర్వే చేసి హద్దులు నిర్ణయించి , ఆక్రమణలను గుర్తించడం జరిగింది. సర్వే నెంబర్ 114లోని 38 ఏకరాల విస్తీర్ణం గల మిరియాల చెరువును కొందరు పూర్తిగా ఆక్రమించి సాగు భూమిగా మార్చేసి వరి, చెరకు, సరుగుడు తోటలు సాగు చేస్తున్నారు.ఆక్రమణలతో చెరువు ఆయకట్టుకు సాగునీటి అవసరాలకు ఉపయోగపడలేదు. గత నెల 12న గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికులు ఫిర్యాదు చేయగా సర్వే చేపట్టి 10 ఎకరాలను 23 మంది రైతులు ఆక్రమించినట్టు గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. అప్పట్లో చెరువు గర్భంలో వరి పంట ఉండడంతో వరి కోతలు అనంతరం ఆక్రమణ దారులు ఖాళీ చేస్తామని చెప్పారు. జనవరి 9న వీఆర్వో, సచివాలయ సర్వేయర్లను పంపించి పోలీసులు సమక్షంలో చెరువుకు హద్దులు నిర్ధారించి చెరువు చుట్టూ సరిహద్దు రాళ్ల పాతించి, ఎర్రజెండాలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు చెరువు అభివృద్ధికి రూ 5లక్షల నిధులు కేటాయించారు. ఇది జరిగి రెండు నెలలు కావస్తున్నా ఉపాధి పనులు చేయలేదు. దీంతో రైతులు మరోసారి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో బుధవారం తహసీల్దార్ వెంకటరమణ, వీఆర్వో, సర్వేయరులు వెళ్లి ఆక్రమణలు తొలగిస్తుండగా, ఆక్రమణ దారులు అడ్డుకునే ప్రయత్నంచేశారు. దీంతో అడ్డుకొనే వారిపై కేసులు నమోదు చేయాలని రావికమతం ఎస్ఐ రఘువర్మకు ఆదేశాలు జారీ చేశారు.

చెరకును ఫ్యాక్టరీకి తరలించండి

రావికమతం ; గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి రావికమతం చెరకు కాటా నుంచి చెరకును తరిలించేందుకు తక్షణమే రవాణా ఏర్పాటు చేయాలని రావికమతం చెరకు కాటా వద్ద రైతులు బుధవారం ఆందోళన చేశారు. రావికమతం తూనిక కాటా నుంచి చెరుకును తీసుకెళ్లే కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో చెరకును తీసుకెళ్లడానికి లారీలు రాకపోవడంతో రావికమతం కాటా వద్ద చెరుకు ఎండి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం చొరవ తీసుకొని చెరకును ఫ్యాక్టరీకి తరిలించే ఏర్పాట్లు చేయాలని, తక్షణం చెరకు బకాయిలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.


ప్రభుత్వ భూముల ఆక్రమణ తొలగింపు



ఆక్రమణలను తొలగింపు చేస్తున్న రెవెన్యూ అధికారులు

దేవరాపల్లి : తెనుగుపూడి–దేవరాపల్లి రహదారికి ఆనుకొని ఉన్న స్థలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ పి.లక్ష్మీదేవి స్పందించారు. తెనుగుపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 174లో మండల సర్వేయర్ గోవిందరాజులుతో పాటు వీఆర్‌వో రమణమ్మ తదితర రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. సుమారు 11 సెంట్లు మేర ఆక్రమణ ఉందని నిర్ధారించి, మార్కింగ్ చేశారు. ఆక్రమణ స్థలంలో ఉన్న ప్రహరీని దగ్గరుండి తొలగింపు చేశారు.


పాస్టర్ ప్రవీణ్ మృతిపై సీబీఐ విచారణ జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొట్టా నాగరాజు

నర్సీపట్నం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జ్ బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మత దాడులు, మైనార్టీలపై, బహుజనులపై దాడులు పెరిగాయన్నారు. బహుజనుల రక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో అగ్ర నాయకులే మతం పేరు చెప్పి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారన్నారు. రాజమండ్రి ప్రాంతంలో జరిగిన బహుజన పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానస్పద మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ హత్యేనని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బహుజన నాయకులు కొల్లి గంగాధర్, చిరంజీవి, సంజీవ్, సూరిబాబు పాల్గొన్నారు.

అనుమతిలేని లేఅవుట్‌లో బోర్డుల ఏర్పాటు



లేఅవుట్‌లో బోర్డు ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి బాలదొర

మాకవరపాలెం : తామరం రెవెన్యూలో సర్వే నంబర్ 67లో ఇటీవల 19.93 ఎకరాల్లో లేవుట్ వేశారు. సెంట్ల చొప్పున విభజించి సరిహద్దు రాళ్లను సైతం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఈ లేఅవుట్‌కు పంచాయతీ, వీఎంఆర్‌డీఏ నుంచి ఎలాంటి అనుమతులు లేవని కార్యదర్శి బాలదొర బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా వేసే లేఅవుట్లలో క్రయ విక్రయాలు చెల్లవన్నారు. స్థలాలు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాలకు ఇబ్బందులు పడాల్సివస్తుందని, అన్ని అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకున్న అనంతరమే స్థలాలు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

హెల్త్ క్లినిక్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీ

గొలుగొండ : గుండిపాల హెల్త్ క్లినిక్ కేంద్రాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారి జగదీష్,, జిల్లా అదనపు వైద్యాధికారి ప్రశాంతి బుధవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మంచి వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

అభివృద్ధి పనుల జాప్యంపై సభ్యుల ఆగ్రహం

- పంచాయతీరాజ్ జేఈ కారణమని ధ్వజం
- వాడీవేడిగా మండల సమావేశం



జేఈపై సభలో ఎంపీపీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ తదితరులు

నాతవరం : గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంజూరు చేసిన మండల పరిషత్ నిధులతో సకాలంలో పనులు పూర్తి చేయకపోవడానికి పంచాయతీరాజ్ జేఈ వెంకటేశ్వరమ్మ కారణమని పలువురు సభ్యులు ఆరోపించారు. మండల సర్వ సభ్య సమావేశం బుధవారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి ఎంపీటీసీలకు గ్రామాల అభివృద్ధికి గతంలో నిధులు మంజూరు చేశారని, ఆ నిధులు ఈ నెలాఖరుకు ఖర్చు చేయాలని లేకుంటే మరలా నిధులు ప్రభుత్వం విడుదల చేయదంటూ కార్యాలయ సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారధి సభలో తెలిపారు. ఈ విషయంపై పెదగొలుగొండపేట ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ జేఈ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు జరగలేదన్నారు.. పనులు చేసేందుకు గ్రామంలోకి వచ్చి జేఈ మార్కింగ్ ఇవ్వాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కోరినా ఆమె రావడం లేదని, కనీసం ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జేఈ పని తీరులో మార్పు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన. ఉపాధి హామీ పథకం సోషల్ అడిట్‌లో పీఆర్ శాఖకు సంబంధించి లోపాలు అధికంగా ఉన్నాయంటూ డ్వామా ప్రాజెక్టు అధికారి అన్నారన్నారు. మా గ్రామంలో రోడ్డు సమస్యపై గతంలో జేఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ పైల సునీల్ అన్నారు. సభలో కొంతమంది సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులైన మహిళలకు బదులుగా భర్తలు సభకు వచ్చి మాట్లాడడంపై వైఎస్సార్‌సీపీ టీడీపీ సభ్యుల నడుమ వాగ్వాదం జరిగింది. ఎంపీపీ కలుగజేసుకుని సభ్యులకు బదులు సూపర్లు సభలోకి రావద్దని సూచించడంతో వివాదం సద్దుమణిగింది. రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈనెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు నిలుపుదల చేస్తారని ఎంపీపీ అన్నారు. మండల సమావేశాలకు అన్ని శాఖల అధికారులు రావడం లేదని పీకే గూడెం సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు అన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీ పైల సునీల్ పాల్గొన్నారు.

డీటీ నూకరాజు బాధ్యతల స్వీకరణ



మాకవరపాలెం: డిప్యూటీ తహసీల్దార్‌గా కె.నూకరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీటీ సోమశేఖర్‌ను డిప్యుటేషన్ పై యలమంచిలి సివిల్ సప్‌లై డీటీగా నియమించారు. ఆయన స్థానంలో యలమంచిలి సివిల్ సప్‌లై డీటీ నూకరాజును నియమిస్తూ జేసీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం నూకరాజు విధుల్లో చేరారు.

మంచాలలో మంచినీరు బోర్లు ఏర్పాట్లు



బోర్ల తవ్వకాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చీడికాడ : మండలంలోని మంచాలలో పలు కుటుంబాలకు చెందిన పశువుల పాకల వద్ద తాగునీటి సమస్య మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో పరిష్కారం అవుతుందని వైఎస్సార్‌సీపీ నేత, ఉపసర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ, పార్టీ నేత పాటూరి రమణ తెలిపారు. గ్రామంలోని భూలోకమ్మ గుడి, పెద్దింటి వారి, కర్ణం వారి కళ్లాల వద్ద గల తాగునీటి సమస్యపై మాజీ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా జెడ్పీ నిధుల నుంచి రెండు బోర్లు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు రెండుబోర్లు ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించినట్టు తెలిపారు. బూడికి, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు ఇసింశెట్టి దేముడు, బోను శ్రీరామమూర్తి, కసిరెడ్డి రామారావు, ఒ.ఇ.నాయుడు, ముసిలినాయుడు, పెద్దింటి అప్పలనాయుడు పాల్గొన్నారు.

వారపు సంత ఆశీలు వేలం ఖరారు

నాతవరం : మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారపు సంత బహిరంగ వేలం పాట బుధవారం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ఎంపీడీవో కె.ఉషాశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటకు నాతవరం మండలం నర్సీపట్నం మండలాల నుంచి పలువురు విచ్చేసారు. ఈ పాటలో అధికంగా రూ.60,200లకు నర్సీపట్నం చెందిన ఎల్.వి.ఆర్ పాడడంతో అతనికి ఖరారు చేశారు. ఈవేలం పాటదారుడు వారపు సంతలో ఏడాది పాటు ఆశీలు వసూలు చేసుకునే విధంగా సమయం కేటాయిస్తూ రేట్లు ఖరారు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలతల్లి పండగకు ఏర్పాట్లు

నేటి నుంచి కేపీ అగ్రహారంలో సంబరాలు



కేపీ అగ్రహారంలో పండగకు ముస్తాబైన నూకాలతల్లి ఆలయం

బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో నూకాలతల్లి పండగను వేడుకగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. కేపీ అగ్రహారం నూకాలతల్లి పండగను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. గురువారం అమ్మవారికి పూజలు, అఖండ దీపారాధన, జాగారం పండగ, రాత్రికి జిల్లా స్థాయి కోలాటాల పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు ప్రథమ నుంచి 8వ బహుమతి వరకు వరసగా 12, 10, 8, 6, 5, 4, 3, 2 వేల రూపాయల చొప్పున నగదు, షీల్డులు అందిస్తారన్నారు. కోలాటాల పోటీల్లో పాల్గొని బహుమతి రాని వారికి రవాణా ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.1,500 నగదును కమిటీవారు అందిస్తారన్నారు. శుక్రవారం అమ్మవారి పెద్ద పండగతో పాటు అగ్ని గుండం తొక్కుట, నేల డాన్స్‌లు, డప్పుల వాయిద్యాల నడుమ అమ్మవారి ఊరేగింపు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు వరసగా 15, 12, 10, 8, 6, 4 వేల రూపాయల నగదు, షీల్డు అందిస్తారన్నారు. ఎడ్ల పరుగు పోటీల్లో బహుమతి రాని వారికి రవాణా ఖర్చుల కింద రూ.1,500 నగదును కమిటీవారు అందిస్తారన్నారు. అలాగే ఆర్ భీమవరం, పెదపూడి, తురకలపూడి, వడ్డాది, విజయరామరాజుపేట, రాజాం, పెదమదీన, గున్నెంపూడి తదితర గ్రామాల్లో ఆలయాలకు రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు. పల్లె గ్రామాల్లో రైతులు ఎక్కువ మంది తమ పశువులకు, కుటుంబ సభ్యులకు ఎటువంటి అంటురోగాలు కలగకుండా చల్లని దీవెనలు అందించాలని భక్తిశ్రద్ధలతో నూకాలతల్లిని కొలిచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

పెయ్యిదూడల పథకంలో కృత్రిమ గర్భధారణ

మాకవరపాలెం: పాడి రైతులు పెయ్యిదూడల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి మణిదీప్ తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడు తూ పెయ్యిదూడల పథకంలో ఎదకు వచ్చిన పశువునకు కృత్రిమ గర్భధారణకు రాయితీపోను రైతులు రూ.500 చెల్లిస్తే ఇంజెక్షన్ చేస్తారన్నారు. అదే పశువు మరలా ఎదకు వస్తే ఉచితంగా గర్భధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో లచ్చన్నపాలెం, మాకవరపాలెంలో 16 ఆడ దూడలు జన్మించాయన్నా రు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నర్సీపట్నం : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రిషి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాను జిల్లా నైపుణ్య అధికారి ఎస్.గోవిందరావు, స్పీకర్ తనయుడు, కౌన్సిలర్ సిహెచ్.రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కంటే ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల్లో పారితోషకం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగమనే కాకుండా వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి 985 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 18 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం : సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ బుధవారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు.